# ప్రశ్నించే హక్కును కాపాడుకుందాం

ప్రశ్నించే హక్కుకు చీకట్లు కమ్ముకుంటున్నాయంటే అతిశయోక్తిగా అనిపించవచ్చును గానీ అది అక్షరాలా సత్యం.

మీరు ఈ కరపత్రం ప్రచురించ గలిగారు కదా! అంటారేమో ఇంక ఎన్నాళ్లు ప్రచురించగలుగుతామన్నది ప్రశ్న.

'పోటో'ను చట్టం కానివ్వమని వామపక్ష పార్టీలే కాకుండ కాంగ్రెస్ పార్టీ కూడ అంటున్నది. ఆ మాట మీద వారు నిలబడితే ప్రస్తుతానికి గండం పక్కకు పోవచ్చును గానీ పార్లమెంటు ఉభయ సభలలో మెజారిటీ లభించిన పార్టీ ఏరోజు తలపెడితే ఆరోజు 'పోటో' మళ్లీ 'పోటా' కాగలదు. ఆర్డినెన్స్ చట్టం కాగలదు. ఆ ఘడియ ఎంతో దూరం లేకపోవచ్చును.

టెర్రరిజం మీద ఉక్కుపాదం మోపడానికని చట్టం చేస్తే మీరు ప్రశ్నించే హక్కు పోతున్నదంటారెందుకు? ప్రశ్నించడమంటే తుపాకులతోననా మీ భావం? అని అడుగుతారేమో.

కాదు ప్రశ్నించడమంటే తుపాకులతోనని మా అభిప్రాయం కాదు. అయితే ప్రభుత్వం ఒక చట్టాన్ని ఎందుకోసం తీసుకొస్తున్నానని చెప్తుందో విని, అదే సత్యమనుకుంటే పెద్ద పొరపాటు.

చట్టంలో ఏమేమి రాసారో చూడాలి. దానిని ఎవరెవరి మీద ప్రయోగించగలరో చూడాలి. దానిని దుర్వినియోగం చేస్తే ఇంకెంత మంది మీద ప్రయోగించగలరో చూడాలి. దానిని అమలు పరిచే యంత్రాంగం నైజమేమిటో చూడాలి. ఇవన్నీ చూస్తే తప్ప విషయం అర్థంకాదు. ఇవన్నీ చూసిన తరువాతే ప్రశ్నించే హక్కుకు చీకట్లు కమ్ముకుంటున్నాయంటున్నాము.

'టెర్రరిస్టులు' అని ఎవరినైతే ఈ పోటో చట్టం నిర్వచిస్తుందో, వారిని ఇంటర్వ్యూ చేసే పత్రికా విలేకరులు వారెక్కడ వున్నదీ వెంటనే పోలీసులకు చెప్పాలి. లేకపోతే ఒక సంవత్సరం జైలుకు పోవాలి.

అంటే 'టెర్రరిస్టులు' అన్న ముద్ర ప్రభుత్వం న్యాయంగా వేస్తున్నదా, అన్యాయంగా వేస్తున్నదా, దానికి ఆ 'టెర్రరిస్టులు' చెప్పే జవాబేమిటి, అందులోని సత్యమెంత – ఇత్యాది విషయాలు పత్రికల ద్వారా తెలుసుకునే హక్కు, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ప్రజలకు లేదు.

ఒక సంస్థను ప్రభుత్వం నిషేధించినట్టయితే, ఆ సంస్థ లక్ష్యాలకు ఏ రూపంలోనైనా సహాయం చేయడం, సహకరించడం జీవిత ఖైదు వేయగల నేరం. ఉదాహరణకు అస్సాంకు చెందిన అల్ఫా ఒక నిషిద్ధ సంస్థ. భారతదేశంలో అంతర్భాగంగా వున్నంతకాలం అస్సామీలకు న్యాయం జరగదని అల్ఫా నమ్ముతుంది. కాబట్టి ఇప్పుడెవరైనా భారత ప్రభుత్వ పాలన వల్ల అస్సాంకు అన్యాయం జరిగిందని మాట్లాడితే అది 'అల్ఫా' లక్ష్యాలకు సహకరించినట్లు అవుతుంది. కాబట్టి ఆ అభిప్రాయం వ్యక్తం చేయడం జీవిత ఖైదు విధించగల నేరం అవుతుంది.

టెర్రరిస్టు సంస్థ అని ప్రభుత్వం ప్రకటించిన జాబితాలోని సంస్థల కార్యక్రమాలు కొనసాగించడానికి తోడ్పడే సమావేశం ఏర్పాటు చేయడానికి సహకరించినట్టయితే 14 సంవత్సరాల దాకా ఖైదు చేయవచ్చు. ఇక్కడ సమావేశం అంటే బహిరంగ సభే కానక్కరలేదు. ఇద్దరికంటె ఎక్కువ పాల్గొనే ఏ సమావేశమైనా దీనికిందకి వస్తుంది. ఇది టెర్రరిస్టు సంస్థ సభ్యులు మాత్రమే పాల్గొనే అంతర్గత సమావేశం కానక్కరలేదు. ఆ సంస్థ సభ్యులు, లేక సభ్యునిగా చెప్పుకునే వ్యక్తి తన అభిప్రాయాలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించడం కోసం ఇద్దరి కంటె ఎక్కువ మందితో మీటింగ్ ఎవరైనా ఏర్పాటు చేస్తే వారికి కూడ శిక్ష వర్తిస్తుంది.

ఉదాహరణకు రేపు మన రాష్ట్రంలోని నక్సలైట్ సంస్థలను ఈ జాబితాలో చేర్చారనుకోండి. (చేర్చలేదని తెలుగు ప్రభువులు కినుక వహించి ఉన్నారు) అప్పుడు వారి భావాలు కరెక్టేనని చెప్పే కవిచేత గానీ, కళాకారుడిచేత గానీ 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం ఏర్పాటుచేసినా, పదిమందిని పిలిచి చర్చావేదిక నిర్వహించినా అది 14 సంవత్సరాల జైలు శిక్షకు అర్హమైన నేరం.

కాశ్మీర్‌లో తిరుగుబాటుదారులు ఏం కోరుకుంటున్నారో దేశంలోని ఇతర ప్రాంత వాసులకు చెప్పడం కోసం హురియత్ కాన్ఫరెన్స్ ప్రతినిధులు ఆ మధ్య దేశమంతా పర్యటించారు. వారి అభిప్రాయాలు స్థానిక ప్రజలు వినగలందుకు హక్కుల సంఘాలు దేశవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించాయి. అప్పటికి ఈ చట్టం లేదు గానీ వుంటే ఈ హక్కుల సంఘాలన్నీ 14 సంవత్సరాల జైలు శిక్ష వేయగల నేరం చేసినట్టు అయి వుండేది. గద్దర్‌ను ఇంటర్వ్యూ చేసిన 'శుభోదయం' (తేజ టివి) వారికి కూడ ఇది వర్తిస్తుంది.

తమ లక్ష్యాల సాధన కోసం ప్రజాస్వామ్యాన్ని భయోత్పాతానికి గురిచేసే హింసకు పాల్పడడాన్ని టెర్రరిజం అనదలచుకున్నట్టయితే ఆ టెర్రరిజాన్ని ఎవ్వరూ హర్షించరు. దానిని అరికట్టవలసిందేనని అందరూ ఒప్పుకుంటారు. అయితే 'పోటో' వంటి చట్టాలలో టెర్రరిజం నిర్వచనం అక్కడితో ఆగిపోలేదన్న సంగతి అటుంచినా, మనం హేయమైనదిగా

కరపత్రం

భావించే విచ్చలవిడి హింసాకాండకు కూడ దాని వెనుక కొన్ని సామాజిక వాస్తవాలున్నాయి, ఏదో ఒక ప్రజావర్గంలోని అసంతృప్తి, నిరసన వున్నాయి. విచ్చలవిడి హింసాకాండను మాన్పించడం ఎంత ముఖ్యమో ఈ నిరసననూ, అసంతృప్తినీ చర్చించడం, దాని గొంతు వినడం, న్యాయబద్ధంగా స్పందించడం అంతే ముఖ్యం. బహుశా అంతకంటె ముఖ్యం. దీని గొంతు నొక్కేస్తే ఇదొక కాన్సర్ వంటి పుండయి సమాజం మూల్గులు పీల్చేస్తుంది. ఏ సామాజిక వర్గంలో ఆ అసంతృప్తి, నిరసన వున్నాయో ఆ వర్గం విపరీతమైన హింసకూ, పరాయీకరణకు గురవుతుంది.

కాగా, పోటో వంటి చట్టాలు దుర్వినియోగానికి కూడ చాలా అవకాశం ఇస్తాయి. ఏదో ఒక మీటింగ్‌లో ఎవరైనా దేశంలోని ముస్లిం యువతలో సకారణమైన అసంతృప్తి, అసహనం వున్నాయని మాట్లాడితే అతను 'సిమి' భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని ఆ మీటింగ్ నిర్వాహకులను మొత్తంగా పద్నాలుగేళ్లు జైలుకు పంపించవచ్చు. టెర్రరిజం అని పిలవబడే దానికి సామాజిక మూలాలు వున్నాయి అనే భావం వచ్చేటట్టు ఎవరు మాట్లాడినా దానిని ఈరకంగా వక్రీకరించి గొంతు నొక్కేయొచ్చు. 'టెర్రరిజం' అనేదాన్ని ఎదుర్కొనడానికి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల వంటి చట్ట విరుద్ధ సాధనాలను వుపయోగించడం అన్యాయం అన్నా అంతే.

'పోటో' ఇంకా రాకుండానే దేశవ్యాప్తంగా ముస్లింలపైన, తెలంగాణ వంటి ప్రాంతాలలో పేద ప్రజలపైన భావ నిర్బంధం తీవ్రస్థాయిలో అమలవుతున్నది. తెలంగాణకు అన్యాయం జరిగిందని నవంబర్ 1న వరంగల్‌లో నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు 'మీరంతా నక్సలైట్లు' అని నిందించడం, అది అన్యాయం అని అభ్యంతరం చెప్పిన మానవ హక్కుల వేదిక బాధ్యుడు డా॥ బుర్ర రాములు పైన హన్మకొండ సిఐ చేయి చేసుకొనడం, అతనిని అరెస్టుచేసి ఆనాటి ప్రజాస్వామిక కార్యక్రమానికి అడ్డుతగిలింది కాక, డా॥ రాములే పోలీసుల విధి నిర్వహణకు అడ్డుతగిలాడని అతనిపైన హన్మకొండ సిఐ కేసు పెట్టడం, వరంగల్ ప్రజలకు తెలిసిన సంగతే.

చట్టాన్నీ ప్రజల హక్కులనూ గౌరవించే పోలీసు వ్యవస్థ వున్నచోట కూడ 'పోటో' వంటి చట్టాలను వ్యతిరేకించవలసిందే. కానీ హక్కులంటే ఏమాత్రం గౌరవం లేని పోలీసు సంస్కృతి రాజ్యం చేసే చోట పోటో వంటి చట్టాలను ఉనికిలోకి రానిస్తే పాలక పార్టీకి వారి పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ మాట్లాడే హక్కు మిగలదు.

ప్రస్తుతానికి ప్రతిపక్ష పార్టీల వ్యతిరేకత కారణంగా 'పోటో' చట్టం కాలేకపోవచ్చు. కానీ ఈ పరిస్థితి ఎప్పటికీ వుండబోయేది కాదు కాబట్టి ఈ ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయొద్దు, నిరసిద్దాం రండి.

17.11.2001